క్లుప్తంగా

ముగిసిన సప్తాహం



సప్తాహంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్

ఉట్నూర్‌రూరల్‌: మండలంలోని హస్నాపూర్‌ గ్రామంలో నిర్వహించిన సప్తాహ వేడుకలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ ఉపేందర్‌, జ్ఞానోబా, అమర్‌నాథ్‌, సుభాష్‌, ప్రకాశ్‌, ఇరోలే, భుజంగ్‌రావు, దొంది రామ్‌ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు, సిబ్బంది

బేల: మండల ఎంపీడీవో భగత్‌ రవీందర్‌ ఈనెల 15న గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సంస్మరణ సభ ఏర్పాటు చేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రావుత్‌ మనోహర్‌, ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్‌, మాజీ ఎంపీపీ రఘుకుల్‌ రెడ్డి, నాయకులు సతీష్‌ పవార్‌, ప్రమోద్‌రెడ్డి, బండి సుదర్శన్‌, గోడం సునీల్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన

ఉట్నూర్‌రూరల్‌: మండలంలోని శ్యాంపూర్‌ జెడ్పీఎస్‌ఎస్‌ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను జిల్లా పరిశీలకులు చవాన్‌భరత్‌ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వాహణపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అధ్యాపకులు తిరుపతి, రవీందర్‌, రాజ్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న నల్ల రత్నాకర్‌రెడ్డి

తలమడుగు: గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయాలని జిల్లా రిటైర్డ్‌ టీచర్స్‌ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు నల్ల రత్నాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లి(బి) గ్రామంలో ప్రజాగోస.. బీజేపీ భరోసా యాత్రలో భాగంగా కార్నర్‌ మీటింగ్‌ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీఆర్‌ఎస్‌ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు స్వామి, కిరణ్‌, దేవన్న, ధనుంజయ్‌, మాధవరావు, రాజు, శేఖర్‌, శ్రీనివాస్‌, స్వామి, పోచ్చన్న, ప్రకాష్‌, నరేష్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఉట్నూర్‌ జెడ్పీటీసీ చారులత రాథోడ్‌ అన్నారు. శుక్రవారం మండలంలోని జాలంతండా, సకారంతండా గ్రామాల్లో నిర్వహించిన హాథ్‌ సే హాథ్‌ జోడో కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావ్‌, నాయకులు దేవ్‌సింగ్‌, సంతోష్‌, ప్రహ్లాద్‌, గులాబ్‌ పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

ఆదిలాబాద్‌: జిల్లా కేంద్రంలోని బాలకేంద్రం చిన్నారులు జాతీయస్థాయిలో ప్రతిభను కనబరుస్తున్నారని విద్యాశాఖ సెక్టోరియల్‌ అధికారి నారాయణ అన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని వార్ధాలో నిర్వహించిన జాతీయస్థాయి డాన్స్‌ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలకేంద్రం చిన్నారులకు గురువారం రాత్రి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాల కేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి, సృజన, శ్రవణ్‌, సాయినాథ్‌, రుచిత, అనూష, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి సర్వం సిద్ధం

- ముస్తాబైన ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయకమిటీ సభ్యులు



బేల: నందీశ్వర విగ్రహానికి పూజలు చేస్తున్న జుగ్నాక్‌ వంశీయులు



తలమడుగు: ముస్తాబైన చెర్లపల్లి శివాలయం

తలమడుగు: మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు అయ్యాయి. మండలంలోని రాజరాజేశ్వర శివాలయాన్ని రంగురంగుల విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. ఝరితో పాటు చెర్లపల్లి, రుయ్యడి ఆలయాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు భజన పోటీలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నందీశ్వర ఆలయానికి బారులు..

బేల: మండలంలోని బాది గ్రామ శివారులోని నందీశ్వర ఆలయానికి శుక్రవారం ప్రత్యేక ఉపవాస దీక్షలతో భక్తులు బారులు తీరారు. ఆలయంలో శివలింగం, నందీశ్వర విగ్రహాలకు జుగ్నాక్‌ వంశీయులు ప్రత్యేక పూజలు చేసి, జాతర ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆవులు, లేగ దూడలను ఆలయానికి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉట్నూర్‌, నార్నూర్‌, ఇంద్రవెల్లి, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

శివపార్వతుల కల్యాణం

ఆదిలాబాద్‌: జిల్లా కేంద్రంలోని శ్రీగంగపుత్ర శివాలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకం నిర్వహించి కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు.

ముందస్తు శివరాత్రి

ఆదిలాబాద్‌: జిల్లా కేంద్రంలోని శ్రీ బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ముందస్తు శివరాత్రి వేడుకలు నిర్వహించారు. శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దీంతో శివనామ స్మరణతో పురవీధులు మార్మోగాయి.

ఆదిలాబాద్‌రూరల్‌: మహా శివరాత్రికి ఆదిలాబాద్‌ రూరల్‌, మావల మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. శనివారం యజ్ఞపూజ, అన్నదానం, అర్ధరాత్రి హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పూజారులు తెలిపారు. ఆదివారం పూర్ణహుతి, అన్నదానం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



ఆదిలాబాద్‌: కల్యాణానికి హాజరైన భక్తులు

పరమశివుడిని కొలిచే రాత్రి శివరాత్రి



‘శివప్రియాతుదుపానానార్థా రాత్రి శివరాత్రి’ అని స్కాంద పురాణం తెలుపుతుంది. అన్ని పండుగలను పగటి పూట నిర్వహించుకుంటే, మహా శివరాత్రి మాత్రమే రాత్రివేళ జరుపుకుంటారు. అభిషేకం, ఉపవాసం, జాగరణతో పరమేశ్వరున్ని కొలిచే దివ్యమైన రాత్రి శివరాత్రి. భక్తులు శివుడిని పూజిస్తే విశేష పుణ్య ఫలాలు అందుతాయి.

– శివశ్రీ గొంగ్లె ప్రవీణ్‌ స్వామి, శైవాగమ పండితులు

యువత కలలను సాకారం చేసుకోవాలి



నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్‌: యువత కష్టపడి కలలను సాకారం చేసుకోవాలని ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. టెలికాం ఇండస్ట్రీలోని పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం టీటీడీసీలో నియామక పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాబ్‌మేళాకు 500 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 260 మంది ఎంపికైనట్లు తెలిపారు. యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌ రిజ్వాన్‌ భాషా షేక్‌, డీఆర్‌డీఏ పీడీ కిషన్‌, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలను విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌టౌన్‌: మహా శివరాత్రి పురస్కరించుకొని అనుకుంటలో శనివారం నిర్వహించే వేడుకలను విజయవంతం చేయాలని ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలో మహా శివరాత్రికి సంబంధించి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివుడి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ జోగు ప్రేమేందర్‌, సభ్యులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌: ఛత్రపతి శివాజీ మహరాజ్‌ 393వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని మరాఠా కిరీడి కునబీ సమాజ్‌ జిల్లా అధ్యక్షుడు విజయ్‌ సావాపురే కోరారు. జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్‌ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ఈనెల 19న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కేంద్రంలోని రామ్‌లీలా మైదానం నుంచి శివాజీ చౌక్‌ వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు సంతోష్‌, తదితరులు పాల్గొన్నారు.

దోబీఘాట్‌ అందుబాటులోకి తీసుకురావాలి



తాళం వేసి ఉన్న దోబీఘాట్‌ను చూపుతున్న సుహాసినిరెడ్డి, నాయకులు

ఆదిలాబాద్‌: జిల్లా కేంద్రంలోని పిట్టలవాడ కాలనీలో అత్యాధునిక వసతులతో నిర్మించిన ధోబీఘాట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి డిమాండ్‌ చేశారు. శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి దోబీఘాట్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దోబీఘాట్‌ నిర్మించి ఏడాది అవుతున్నా.. వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. రూ. 50 లక్షలు వెచ్చించి, ఆధునిక యంత్రాలను సమకూర్చినా.. నిర్వహణను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శివయ్య, నాయకులు సంతోష్‌ కొత్తపెల్లి, కాంత, సతీష్‌ రెడ్డి, రోహిత్‌, సాయి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు మహాకాల్‌ ర్యాలీ

ఎదులాపురం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మహాకాల్‌ సేన ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మహాకాల్‌ సేన అధ్యక్షుడు మహాకాల్‌ అజయ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆదిత్యనగర్‌ కాలనీ నుంచి రాంనగర్‌, కలెక్టరేట్‌ చౌక్‌, ఎన్టీఆర్‌ చౌక్‌, వినాయక చౌక్‌ల మీదుగా గంగపుత్ర శివాలయం వరకు కొనసాగుతుందన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో జిల్లా పరిషత్‌ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించే మట్టిరోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. పంటచేన్లకు వెళ్లేందుకు నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు జెడ్పీటీసీ రాజు, సర్పంచ్‌ సంజీవ్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ అశోక్‌, నాయకులు రఘు, రమణ, విలాస్‌ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఇచ్చోడ: మండలంలోని బోరిగామలో శుక్రవారం రూ. 10 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను సర్పంచ్‌ కుంట అరుంధతి సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్‌ ప్రభుత్వ హయాంలో సీసీరోడ్ల నిర్మాణలకు నిధులు మంజూరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన

నార్నూర్‌: ఉట్నూర్‌ కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన స్పోర్ట్స్‌ కల్చరల్‌ ఫెస్ట్‌లో మండలంలోని జామ్‌డా బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. శుక్రవారం విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్‌ నెహ్రూ, ఉపాధ్యాయులు అభినందించారు. ఇందులో పీఈడీ అడే విశ్వనాథ్‌, రాథోడ్‌ పుష్పలత, చంపావతి, సునీత, సుజాత, విజయలక్ష్మి, రవి, హరిశ్చంద్‌, కైలాస్‌, బాలాజీ, రాజు, శివాజీ, గంగాధర్‌ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

తలమడుగు: మండలంలోని అర్లి గ్రామంలో శుక్రవారం బీసీ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కాళ్ల రాజేష్‌, అధ్యక్షుడిగా వినోద్‌, ప్రధాన కార్యదర్శిగా కత్రాజీ, స్వామి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా సత్యానారాయణ, ప్రచార కార్యదర్శిగా మహావీర్‌, కోశాధికారిగా బుచ్చన్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అసం రవీందర్‌, రవికాంత్‌, ప్రభాకర్‌, లస్మన్న పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీటీసీ

తలమడుగు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఝరి, గ్రామంలో మహా శివరాత్రిని పురష్కరించుకొని రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కబడ్డీ పోటీలు ప్రారంభించారు. కబడ్డీ పోటీలను యువజన సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండో బహుమతి రూ. వేలు, మూడో బహుమతి రూ. 10 వేలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వన్నెల అశోక్‌, రాజేశ్వర్‌, దివ్య మాధవ్‌, భూమారెడ్డి, వినోద్‌ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

నేరడిగొండ: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సర్పంచ్‌ అల్లూరి ప్రపుల్‌ చందర్‌ రెడ్డి అన్నారు. మండలంలోని తేజాపూర్‌ గ్రామంలో కృషి మిత్ర యూత్‌ వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో బీజేపీ గిరిజన రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్‌ ఆర్థిక సాయంతో నిర్వహించిన క్రికెట్‌ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అల్లూరి గంగమ్మ శ్రీనివాస్‌ రెడ్డి, యూత్‌ సభ్యులు అశోక్‌, రవి, రంజిత్‌, మహేష్‌, రాజు, ప్రశాంత్‌, సుధాకర్‌ పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

- సమస్యలు పరిష్కరించాలని సభ్యుల డిమాండ్‌
- ఎంపీపీ మంజుల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం



అధికారులను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు

తాంసి: భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ప్రజాప్రతినిధులు మిషన్‌ భగీరథ అధికారులను నిలదీశారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ మంజుల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మిషన్‌ భగీరథ ఏఈ ప్రశాంత్‌ మాట్లాడుతుండగా.. గిరిగాం, కప్పర్ల, లీమ్‌గూడ సర్పంచ్‌లు జోక్యం చేసుకొని వారంలో రెండు రోజులు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు జోక్యం చేసుకొని ప్రతీ గ్రామానికి నీటిని సరఫరా చేయాలన్నారు. వ్యవసాయ శాఖ ఏవో రవీందర్‌ మాట్లాతుండగా.. కప్పర్ల సర్పంచ్‌ సదానంద్‌ జోక్యం చేసుకొని రైతులు విక్రాంత్‌ సోయాబీన్‌ వేసి నష్టపోతే ఎందుకు పరిహారం ఇవ్వలేదన్నారు. ఐకేపీ సమావేశాలు జరిగితే ప్రజాప్రతినిధులకు ఎందుకు సమాచారం ఇస్తాలేరని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పలువురు సర్వసభ్య సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేశంలో జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో రవీందర్‌, తహసీల్దార్‌ శ్రీదేవి, ఎంపీవో సుధీర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

‘రైతులకు పరిహారం చెల్లించాలి’



రైతులకు మద్దతు తెలుపుతున్న గండ్రత్‌ సుజాత

తాంసి: పిప్పల్‌కోటి రిజర్వాయర్‌ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్‌ సుజాత అన్నారు. రైతులు చేపట్టిన రిలే దీక్షల్లో శుక్రవారం ఆమె పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. నాలుగు ఏళ్ల గడుస్తున్నా.. ఇంత వరకూ ఎంతుకు పరిహారం ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతులు ఆందోళన చేస్తున్నా.. స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే రైతులతో చర్చలు జరిపి ప్రస్తుతం ఉన్న మార్కెట్‌ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌ మల్లేష్‌, రమేష్‌, నారాయణ, రైతులు స్వామి, నసీరుద్దీన్‌, నర్సింగ్‌, రాంరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహ స్వామి జాతర



లక్ష్మీనృసింహ స్వామి ఆలయం

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయ జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. పురాతన కాలంలో స్వయంగా భూమిలో నుంచి వెలిసిన లక్ష్మీనృసింహ స్వామికి గ్రామస్తులు నిత్యం పూజలు చేస్తుంటారు. శివరాత్రి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. దీంతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం పూర్ణాహుతితో పాటు భక్తజనుల మధ్య రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు గిజ్జ గణపతి తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లను చేయడంతో పాటు, అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనిల్‌జాదవ్‌

నేరడిగొండ: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని జెడ్పీటీసీ అనిల్‌ జాదవ్‌ అన్నారు. శుక్రవారం మండలంలోని లఖంపూర్‌ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో స్పోర్ట్స్‌ కల్చరల్‌ ఫెస్ట్‌–2023 పోటీలకు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈపోటీలు మండలంలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు సృజనాత్మక నైపుణ్యాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో సౌజన్య, ఐఎంవో జగన్‌, ఏపీవో ఆత్రం భాస్కర్‌, సర్పంచ్‌ ఆత్రం జంగు, నేరడిగొండ ఏటేటి దేవేందర్‌ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అశోక్‌రావు, కృష్ణారావు, ఉత్తందాస్‌ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఎదులాపురం: ఎమ్మెల్యే జోగు రామన్నను శుక్రవారం ఖత్రీ సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి సీఎం కేసీఆర్‌ జన్మదినం సందర్భంగా పుష్పాగుచ్ఛం అందజేశారు. నాయకులు ఆదిత్య ఖండేష్కర్‌, శివాజీ నాకోడ్‌, ఉత్తమ్‌ ఖండేష్కర్‌, రాజు, నగేష్‌, ప్రమోద్‌ కుమార్‌ ఖత్రి, పవన్‌ పాల్గొన్నారు.

ఘనంగా సీఎం కేసీఆర్‌ జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేకు స్వీట్‌ తినిపిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు



రోగులకు బ్రెడ్‌ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్‌ జనార్దన్‌

ఆదిలాబాద్‌టౌన్‌: సీఎం కేసీఆర్‌ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలో కేక్‌ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న లబ్ధిదారులకు షాదీముబారక్‌, కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. డీసీసీబీ చైర్మన్‌ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ జోగు ప్రేమేందర్‌, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

- సిరికొండ: తెలంగాణ రైతు బాంధవుడు సీఎం కేసీఆర్‌ అని బీఆర్‌ఎస్‌ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో కేక్‌కట్‌ చేసి పంచిపెట్టారు. సర్పంచ్‌ ఓరగంటి నర్మాద, బాలాజీ, పెంటన్న, బత్తుల అశోక్‌ పాల్గొన్నారు.
- నార్నూర్‌: ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌, ఎంపీపీ కనక మోతుబాయితో కలిసి కేక్‌కట్‌ చేశారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్‌ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ చంద్రశేఖర్‌ జాదవ్‌, సర్పంచ్‌ బానోత్‌ గజానంద్‌నాయక్‌, అడే సురేశ్‌పాల్గొన్నారు.
- తాంసి: ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు నాయకులతో కలిసి కేక్‌కట్‌ చేసి సంబురాలు చేసుకున్నారు. ఇందులో వైస్‌ ఎంపీపీ ముచ్చ రేఖ, అరుణ్‌, రమణ, పరమేష్‌ పాల్గొన్నారు.
- ఇంద్రవెల్లి: బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మారుతి డోంగ్రె నివాసం వద్ద కేక్‌కట్‌ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు మహ్మద్‌ అంజద్‌, కోవ రాజేశ్వర్‌, మెస్రం తుకారం, సర్పంచ్‌ జాదవ్‌ లక్ష్మన్‌ పాల్గొన్నారు.
- నేరడిగొండ: మండలంలోని కుప్టి గ్రామంలోని కేసీఆర్‌ పార్కులో ఎంపీపీ రాథోడ్‌ సజన్‌ మొక్కలు నాటారు. అనంతరం కేక్‌ కట్‌ చేసి పంచిపెట్టారు. ఎంపీపీ కార్యాలయం వద్ద సైతం కేక్‌కట్‌ చేశారు. సర్పంచ్‌లు రాజు యాదవ్‌, పెంట వెంకటరమణ, జంగు, మందుల రమేష్‌ పాల్గొన్నారు.
- ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె)లో సర్పంచ్‌ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్‌ల ఆధ్వర్యంలో పంట పొలాల్లో సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల కన్వీనర్‌ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.
- ఆదిలాబాద్‌రూరల్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని ఆదిలాబాద్‌ రూరల్‌ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సెర్ప్‌ ఉద్యోగులు సీఎం కేసీఆర్‌ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐకేపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శుద్ధోదన్‌, ఉద్యోగులు చంద్రశేఖర్‌, నారాయణ, సమత పాల్గొన్నారు.
- బజార్‌హత్నూర్‌: బజార్‌హత్నూర్‌లో కేసీఆర్‌ జన్మదిన వేడుకలను నిర్వహించారు. బీఆర్‌ఎస్‌ మండల కన్వీనర్‌ కానిందే రాజారాం కేక్‌ కట్‌ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మెడికల్‌ ఆఫీసర్‌ భీంరావ్‌, డుబ్బుల చంద్రశేఖర్‌, చట్ల విలాస్‌, కుర్మే లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

‘బుద్ధుడి స్థలాలు కబ్జా కాకుండా చూడాలి’

ఎదులాపురం: భగవాన్‌ బుద్ధుడికి సంబంధించిన లుంబినీ, అజంతా గుహ, జున్నార్‌ గుహలను కొంత మంది కబ్జా చేస్తున్నారని, వాటిని వారి నుంచి కాపాడాలని కోరుతూ బామ్‌ సేఫ్‌ జిల్లా అధ్యక్షుడు గణేశ్‌ మెకానే అన్నారు. ఈవిషయం రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్‌ ద్వారా వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తుకారాం, హిరాలాల్‌ భగత్‌, దేవిదాస్‌ కాంబ్లే, శాలిక్‌రావు పాల్గొన్నారు.